క్లుప్తంగా

సీపీని కలిసిన సీపీఐ నాయకులు



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ నాయకులు సీపీ సునీల్‌దత్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జిల్లా శాంతి భద్రతలు సహా పలు విషయాలపై చర్చించారు. సీపీని కలిసిన వారిలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేశ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కాలేజెస్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బీబీఏ.రంగారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం బాధ్యులు కె.మధు, ఆర్.ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జీపీ కమలాకర్‌రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా దుంపాల కిరణ్‌లు ఎన్నికైనట్లు చెప్పారు.

మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల కమిటీ..

కామేపల్లి: మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల నూతన కమిటీని మంగళవారం జిల్లా అధ్యక్షుడు నాగరాజుదేవర అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వరికొల్లు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బానోత్ మోహన్, కోశాధికారిగా లక్ష్మీనారాయణతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, శాఖాధికారి ఆర్కే, మండల గౌరవ అధ్యక్షుడు రాయల రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

కామేపల్లి: తాళ్లగూడెం గ్రామంలోని గోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మతల్లి దేవాలయ నిర్మాణ, అభివృద్ధి పనులకు దాతలు విరాళాలు సమర్పించారు. మంగళవారం గ్రామానికి చెందిన యర్రగడ్డ బాబులు, యలమంచమ్మ దంపతులు రూ.లక్ష నగదును ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు.

ఆర్థిక సాయం

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇటీవల మృతి చెందగా.. వారి కుటుంబాలకు రూ.4లక్షల చెక్కులను అందజేశారు. మాజీ సీఎం కేసీఆర్, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు చెక్కులను అందించినట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కామేపల్లి: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కామేపల్లి ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా బెదిరింపులకు పాల్పడిన, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన వెంటనే 100కు డయల్ చేయాలని, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



ఫేర్‌వెల్ డేలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

నేలకొండపల్లి: విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు పట్టుదల ఎంతో అవసరమని నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ శాస్త్రి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నా యి.అధ్యాపకులు గురవయ్య,సత్యనారాయణరెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఊరుపేరు భైరవకోన
వినోద	అంబాజీ పేట మ్యారేజీ బ్యాండ్
సాయిరాం	రాజధాని ఫైల్స్
ఆదిత్య	ఓయ్
శ్రీనివాస	ఈగల్
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

పెరిగేకొద్దీ.. రద్దీ!



వైరా రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

అస్తవ్యస్తంగా నగర ట్రాఫిక్

- మిర్చి సీజన్ కావడంతో పోటెత్తుతున్న వాహనాలు
- గంటల కొద్దీ రోడ్లపైనే నిలుపుతుండగా నెలకొంటున్న సమస్య
- రద్దీ ప్రాంతాల్లో కనిపించని ట్రాఫిక్ పోలీసులు
- ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా చూడాలని పలువురి వేడుకోలు



కిన్నెర పాయింట్ వద్ద..

ఖమ్మం నగరం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. దానికి అనుగుణంగానే వాహనాల సంఖ్య పెరిగి రద్దీ కూడా పెరుగుతోంది. ఉదయం నుంచి మొదలు రాత్రి వరకూ వాహనదారులను ట్రాఫిక్ సమస్య వెంటాడుతూనే ఉంటుంది. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసే ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలుపుతున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ ఓ పెద్ద సమస్య మారి పద్మవ్యూహంలో పడినట్లవుతుందని వాహనదారులు వాపోతున్నారు.

ఖమ్మంక్రైం: నగరం నానాటికీ విస్తరించడంతో వాహనాల సంఖ్య పెరిగి ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించే వారు లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. ఉదయం కార్యాలయాలు, పాఠశాలలు, వ్యాపారాలు ప్రారంభమయ్యే మొదలు రాత్రి వరకు ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కానరాని ట్రాఫిక్ పోలీసులు..

నిత్యం ఖమ్మం నగరానికి వేలాది వాహనాలు వివిధ కారణాల వల్ల వచ్చి పోతుంటాయి. ప్రధాన రహదారి అయిన పాత బస్టాండ్ సెంటర్ నుంచి జెడ్పీ సెంటర్ వరకు నిత్యం ట్రాఫిక్‌తో వాహనదారులు నరకం చూస్తున్నారు. ఈ ప్రాంతమంతా ట్రాఫిక్‌ను నియంత్రించే వారు లేకుండాపోవడంతో పరిస్థితి ఇలా తయారైందని విమర్శలు వినపడుతున్నాయి. కిన్నెర పాయింట్, పాత ఎల్ఐసీ భవనం, జెడ్పీ సెంటర్‌లో ట్రాఫిక్‌ను కంట్రోస్ చేసే పోలీస్ స్పాట్‌లు ఉన్నా.. ట్రాఫిక్‌ను అరికట్టేవారు లేరని, ఒక్కోసారి పోలీసులు కూడా ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఆ రోడ్డంతా వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడంతో పరిస్థితి ఇంకా దారుణంగా తయారైంది.

మిర్చి సీజన్ కావడంతో..

కమాన్‌బజార్, కస్బాబజార్, స్టేషన్ రోడ్డు, త్రీటౌన్ ప్రాంతంలోని గాంధీచౌక్, పొట్టిశ్రీరాములు రోడ్డు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఓ పద్మవ్యూహంలా మారిందని వాహనదారులు చెబుతున్నారు. అసలే మిర్చి సీజన్ కావడంతో పొట్టి శ్రీరాములు రోడ్డులో వ్యాపార కేంద్రాలు కూడా ఉండడంతో చాలాసేపు రోడ్లపైనే వాహనాలు నిలిచిపోతున్నాయి. గాంధీచౌక్ ప్రాంతంలో ఉన్న ప్రధాన వ్యాపార కూడలి వద్ద తెల్లవారుజామున లోడింగ్, అన్‌లోడింగ్ చేయాల్సిందిపోయి ఉదయం నుంచి సాయంత్రం వరకు చేస్తుండడంతో ఆ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులను వాహనదారులు ఎదుర్కొంటున్నారు. ఏదిఏమైనా నగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యను అరికట్టడానికి ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రించాలి..



దినాదినాభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరంలో ట్రాఫిక్ సమస్యను వెంటనే నియంత్రించాలి. వాహనదారులు నిత్యం రోడ్డుపైనే తమ వాహనాలను నిలిపివేస్తుండడంతో నిత్యం రద్దీ నెలకొంటుంది. ప్రయాణం చేయాలంటేనే నరకం చూస్తున్నాం.

– వరగాని కోటేశ్వరరావు, వాహనదారుడు

పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లే..



ఖమ్మంలో అన్ని ప్రధాన కూడళ్లలో వాహనాలపై ప్రయాణం చేస్తున్నప్పుడు ఓ పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లే ఉంటుంది. ఎప్పుడు బయటపడతామో అని అనిపిస్తుంది. ట్రాఫిక్ పోలీసులు వెంటనే స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– కూదలి సురేందర్, వాహనదారుడు

సకాలంలో జీతాలు చెల్లించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రెండు నెలలు దాటినా జీతాలు అందలేదని, ఎంతో మంది ఆరోగ్యాల రక్షణకు ఆస్పత్రిని శుభ్రంగా ఉంచుతూ సేవలందిస్తున్న వారికి సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత నెల కార్మికులు సామూహికంగా విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తే.. ఒక నెల జీతం వేసి అధికారులు చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న కార్మికులకు జీతాలు అందించకపోవడం వల్ల వారి కుటుంబాలు పస్తులతో ఉండాల్సిన పరిస్థితి దాపురించదన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. ప్రభుత్వం నుంచి డబ్బులు రాగానే జీతాలు ఇస్తామని చెబుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇకనైనా కలెక్టర్, మంత్రులు వెంటనే జోక్యం చేసుకొని వారి జీతాలు ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఐఎఫ్‌టీయూ నాయకులు అంబేద్కర్, జగదీశ్, సీతారాములు, శ్రీనివాస్, కల్యాణ్, చందు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మాజీ మంత్రి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం నగరంలో పర్యటించారు. ఇటీవల కార్పొరేటర్ చామకూరి వెంకన్న కుమార్తె ప్రశాంతి వివాహం జరగగా నూతన దంపతులను ఆశీర్వదించారు. అలాగే, గాంధీచౌక్‌లోని శ్రీ వరప్రదాత షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆయన పూజలు చేశారు. ఆతర్వాత అనారోగ్యానికి గురైన ఏపూరి కృష్ణారావుతో పాటు ఇటీవల మృతి చెందిన కొమ్మరాజు శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు, నాయకులు పసుమర్తి రాంమోహన్, వేములపల్లి వెంకన్న, కన్నం ప్రసన్నకృష్ణ, శీలంశెట్టి వీరభద్రం, భీరెడ్డి నాగచంద్రారెడ్డి, గుత్తా రవి, గొరోజు వసంత్, బిక్కసాని జశ్వంత్, బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు.



సాయిబాబాకు పూజలు చేస్తున్న పువ్వాడ

జీళ్లచెరువులో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 25 వరకు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా 23న ధ్వజారోహణం, 24న స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. యాజ్ఞికులు వెలగలేటి రామానుజాచార్యులు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ బూర్లె వీరబాబు, ఈఓ నారాయణచార్యులు పర్యవేక్షిస్తున్నారు.

విప్లవకారుల ఐక్యతతో సమసమాజ నిర్మాణం..



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: దోపిడీ, పీడన, అణచివేత లేని నూతన సమాజ నిర్మాణానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా విప్లవకారుల ఐక్యత దోహదపడుతుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెంలో ఐక్యత సభల ప్రచార వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ, పీసీసీ, సీపీఐ(ఎంఎల్) విప్లవ పార్టీలు కలిసి ఏకమై ఒకే పార్టీగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా ఏర్పడినట్లు తెలిపారు. వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో జరిగే ఐక్యత సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకొని విప్లవోద్యమ నిర్మాణానికి పూనుకోవాల్సిన ఆవశ్యకత విప్లవకారులపై ఉందని, కాలానుగుణంగా విధానాలను రూపొందించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి, ఖమ్మం ఏరియా కార్యదర్శి కొయ్యల శ్రీనివాసు, పార్టీ టౌన్ కార్యదర్శి బొల్లి కొమురయ్య, జె.లెనిన్, ములకలపల్లి లక్ష్మీనారాయణ, ధరణి, జె.వనిత పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న సాయిరిధి

ఖమ్మంగాంధీచౌక్: విజయవాడలో ఇటీవల నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో ఖమ్మానికి చెందిన చిన్నారి మేడేపల్లి సాయిరిధి ప్రతిభ చాటింది. భారత ముని జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలకు వివిధ జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన సుమారు 400 మంది బాలికలు హాజరు కాగా, సాయిరిధి ద్వితీయ స్థానం సాధించడం విశేషం. చిన్నారికి సంస్కార భారతి కళాసాహిత్య సంస్థ నిర్వాహకులు డాక్టర్ టీవీఎస్ కృష్ణ, పి.వి. భాస్కర శర్మ బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సాయిరిధిని స్థానిక సర్వాంగనా పాఠశాల సిబ్బంది అభినందించారు.

'ప్రియదర్శిని' విద్యార్థినులకు ప్లేస్‌మెంట్స్

ఖమ్మం రూరల్: బెంగుళూరుకు చెందిన ప్రముఖ బహుళ జాతి సంస్థ సన్ గ్లేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ నిర్వహించిన ఇంటర్వ్యూలో మండలంలోని ప్రియదర్శిని మహిళల సాంకేతిక కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్లేస్‌మెంట్స్‌కు ఎంపికయ్యారు. మొత్తం 168 మంది విద్యార్థులు హాజరు కాగా 59 మంది ఇంజినీర్ విభాగాల్లో ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్స్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, వివిధ విభాగాల అధిపతులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం లీగల్: నగరంలోని ఖమ్మం కోర్టు ఆవరణలో ఈ నెల 24వ తేదీన నిర్వహించే ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) 9వ జిల్లా మహాసభ పోస్టర్లను ఐఏఎల్ సీనియర్ న్యాయవాదులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పోట్ల మాధావరావు, పెమ్మసాని పట్టాభి, పారుపల్లి అమర్చంద్, షేక్.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, మేకల నవీన్కుమార్, జీ.వీ.లక్ష్మీనారాయణ, ఎండీ.పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నిర్వహించిన ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ పరీక్షలో తమ విద్యార్థి ఎం.అక్షయ్‌రుత్విక్ ప్రతిభ కనబర్చినట్లు సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్.వీ. నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. మంగళవారం విద్యార్థిని పాఠశాలలో అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు.

ఘనంగా తిరుకల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం వీడీఓస్ కాలనీలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రెండో రోజైన మంగళవారం తిరుకల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా.. అర్చకులు శ్యాంశాస్త్రి, భరత్ ఆధ్వర్యాన కల్యాణం జరిగింది. ఈమేరకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించగా, ఆలయ కమిటీ సభ్యులు గుంటుపల్లి శ్రీనివాసరావు, చెరుకూరి రమేశ్‌బాబు, ఏపూరి మధుసూదన్, వెంకటేశ్వరరావు, భవనాశి కేశవరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్, స్థానికులు భాస్కర్, పాపారావు, రామకోటి తదితరులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి తుమ్మల

వినతులు స్వీకరించిన మంత్రి తుమ్మల



సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం తన కార్యాలయంలో పలువురి వద్ద నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.న్నారు.

ఐజేయూ నేతకు పరామర్శ..

ఖమ్మం సహకారనగర్: ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకొని కోలుకుంటున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. మంగళవారం నగరంలోని బుర్హాన్‌పురంలోని రాంనారాయణ నివాసానికి వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, నాయకులు అమరవాది రవీంద్ర శేషు, మాటేటి వేణుగోపాల్‌రావు, సామినేని మురారి, నలజాల వెంకట్రావ్, నాగండ్ల శివ, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో నాబార్డ్ సౌజన్యంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ఆధ్వర్యాన మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ మేనేజర్లు సత్యకీర్తి, ఉపేంద్రయ్య, రామకృష్ణలు మాట్లాడుతూ.. డీసీసీబీ అందిస్తున్న విద్యా రుణాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాక పొదుపు ఆవశ్యకత పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఇన్సూరెన్స్ పథకాల గురించి పలువురు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఈడీసీ కోఆర్డినేటర్ కె ఇందిర, పద్మావతి, అధ్యాపకులు మర్జియాన, శ్రీను, రామారావు, శ్రీనివాస్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ మేనేజర్లు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

ఖమ్మం మామిళ్లగూడెం: ఆసరా పెన్షన్ కంటే తక్కువ పొందుతున్న ఈపీఎస్ 95 పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు పి.కృష్ణమూర్తి, రంగయ్య, మల్లికార్జున రావు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని మంచికంటి హాల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తమకు ఉచిత వైద్యం అందించాలని, 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలు చేయాలని, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాటిబండ్ల కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం నాగేశ్వరావు, మాధవరావు, ఝాన్సీ, రాములమ్మ, నాగేశ్వరావు, జరీనా, బీబీ, మధు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడికి నివాళి

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన సిరిపురం యాదయ్యకు మంగళవారం నగరంలోని అమరవీరుల స్తూపం వద్ద పలువురు ఉద్యమకారులు నివాళులర్పించారు. యాదయ్య వర్ధంతి సందర్భంగా డోకుపర్తి సుబ్బారావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ములక సురేశ్, బొమ్మెర రామ్మూర్తి, బత్తుల సోమయ్య, మంచికంటి నరేశ్, పగడాల నరేందర్, లింగనబోయిన సతీశ్, పాలకుర్తి కృష్ణ, బచ్చలి పద్మాచారి, రాజేష్, నాగేశ్వరరావు, పోతురాజు రమాదేవి, సంగమేశ్వరరావు, ఆంజనేయులు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, అశోక్ సింగ్, విజయ్‌కుమార్, భిక్షం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థులకు ఉద్యోగాలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో జెన్‌ప్యాక్ట్ కంపెనీలో ఉద్యోగాలకు 12 మంది విద్యార్థులు ఎంపికై నట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఎస్‌బీఐటీలో మొదటి విడత పరీక్ష నిర్వహించగా.. వరంగల్‌లో జరిగిన తుది పరీక్షలో విజయం సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు అజరామరం



నివాళులర్పిస్తున్న పోటు ప్రసాద్, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: అమరుల త్యాగాలు అజరామరమని, సమాజ చైతన్యం.. బలహీన వర్గాల అభ్యున్నతికి వారు చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. మతోన్మాదం ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్న తరుణంలో అమరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ అగ్రనేత ఇంద్రజిత్ గుప్తా 23వ వర్ధంతి, ప్రముఖ కమ్యూనిస్టు సామాజిక విప్లవకారుడు గోవింద్ పన్సారే తొమ్మిదో వర్ధంతి సందర్భంగా మంగళవారం సీపీఐ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంద్రజిత్ గుప్తా పార్లమెంట్‌లో సమస్యలను ప్రస్తావించడమే కాక.. వాటి పరిష్కారానికి మార్గం చూపేవాడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యుడు షేక్ జానిమియా, పోటు కళావతి, తాగి వెంకటేశ్వరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మీనారాయణ, రామకృష్ణ, నూనె శశిధర్, శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.